సుప్రసిద్ధ
ఆసియా కథలు-7

# ఆకు పువ్వు లేకపోతే బోదె

రచన
ఎడిత్
ఎల్. టియెంపో
(ఫిలిపైన్స్)



సెబు విమానాశ్రయం గుంపులో మెత్తటి తోలుతో జిప్ వేసి చేసిన సంచీ పట్టుకుని నుంచున్న ఆ మనిషి తల కొంచెం నెరిసి ఉంది. నలభయ్యోవ పడిలో ఉన్నాడు, కొండ చరియలాగున్న అతని నుదురు మీద నుంచి వేళ్లాడుతున్న కనుబొమలు అతన్ని దీర్ఘ చింతనలో ఉన్నవానిలాగ కనుపించేట్లు చేస్తూన్నాయి. దట్టమయిన అతని పక్ష్మాల కింది కళ్లు ఆ హాలును తరచూ కలయచూస్తున్నాయి. బలమయిన వివేకం తెలిపే కళ్లు; 'సెమెటిక్' జాతికి చెందిన వాడా అనిపించేట్లున్నాయి. మనిలా (నగరం) వెళ్లే విమానం ఎక్కటానికి కాచుకుని ఉన్నాడు. అప్పుడప్పుడు అతనొక విధంగా తల పైకెత్తి వంచుకునేవాడు. ఇది ఎందుకో గాని కొంచెం వికారంగానూ, మళ్లీ ఆకర్షణీయంగానూ కూడా ఉంది. అతని భుజాలు ధీమాగా, గట్టిగా కనిపిస్తున్నాయి; ఈ వాలకం కొట్టవచ్చినట్లుండటానికి కారణం అతని కళ్ల లోని కలవరానికి విరుద్ధంగా ఉండటం వల్లనేమో. ఈ వైరుధ్యం ఒక విధమయిన 'పేరు బిళ్ల' (లేబిల్) వంటిది— 'విజయం సాధించినా కలత పడిన మనస్సు కలవాడు.' అన్నట్లు.

లవుడ్ స్పీకర్ చిటపటలాడి, పలికింది. "మిస్టర్ సువెనో, మీ టికెట్ డెస్కు దగ్గిరుంది, వచ్చి తీసుకొనండి!"

ఆ వ్యక్తి తిరిగి, బల్లదగ్గరికి వెళ్లాడు. అక్కడ గుమాస్తాతో మాట్లాడి టికెట్ తీసుకున్నాడు. తర్వాత, మళ్లీ గేటు దగ్గిర తన స్థానంలో వచ్చి నుంచున్నాడు.

అదేక్షణంలో, ఒక అమెరికన్ మిషనరీ గుంపు అవతల నుంచి యువతీ యువకులిద్దరు ఇవతలకి నడిచి వచ్చారు. ఈ మనిషిని చూడగానే అవసరంగా అతన్ని సమీపించారు.

"అనుకోకుండా ఎవరో వస్తే ఆలస్యం అయిపోయింది, తియో ఆగుస్తో!" అంది ఆ అమ్మాయి కొద్దిగా ఆయాసపడుతూ.

ఈ జంటని చూసి ఇంచుమించు గాభరా పడ్డాడు మిస్టర్ సువెనో గాభరాతో బాటు సందిగ్ధావస్థ కూడా సంభవించినట్లుంది, ప్రయాసతో చిరాకుని కప్పిపుచ్చుకున్నాడు. ఇంకెవరయినా అయితే ఈ కర్తవ్యం ఏర్పడి నందుకు ఆనందించే వారు. ఉచితంగా సలహా ఇవ్వటంకన్నా సులభమయిన పనిలేదు కదా! ఈ ఆలోచన రాగానే అతని మనస్సు తేలిక పడింది. తన తమ్ముడి కూతురు, అల్లుడూ వంక వంక వాత్సల్యంతో చూశాడు. సుసానా, ఫెలిక్సుల చూపులో పెద్దవారెవరి కయినా వీడ్కోలు చెప్పే సమయంలో ఏర్పడే చిరాకు కనిపించలేదు; అందులోనూ చిన్న ఉపన్యాసం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న పెద్దకి సుసానా, ఫెలిక్సు లిద్దరూ నిశ్చింతగా ఉన్నారు. ఆ పెద్దమనిషి మనస్సులోని వ్యథ వారికి తెలీదు.

మరి కొన్ని నిముషాలలో వెళ్లిపోతాడు తను, ఏదో పెదనాన్న, పెదమామయ్య హోదాలో చెప్పే హితబోధ కాకుండా మరేదయినా చెప్పాలని తనకి ఉందని గ్రహించాడు మిస్టర్ సువెనో, స్వవిషయాల భారం అతనికి దుర్భరంగా తోచి. ఆ క్షణంలో ఆ చిన్నవారి అమాయక మయిన వైఖరి చూసి జాలిపడ్డాడు, ఇద్దరూ రక్షణలేని వారివలె కనిపించారు అతనికి.

నిలకడ స్వభావం, దైవభక్తి గల ఫెలిక్సుకి సుసానా నిచ్చి పెళ్లిచేసి మూడు రోజులు తిరగ్గానే అతి ముఖ్యమయిన ఈ విషయం ఆమెతో చెప్పకుండా తిరిగి పోవటానికా తను ఇంత దూరమూ, సెబుకి వచ్చాడు? యుద్ధంలో చనిపోయిన తన తమ్ముడి ఏకైక పుత్రిక, రెండేళ్ల వయసు నుంచి తన చేతికింద పెరిగింది. ఈ అమ్మాయికి ఆ సంగతి చెప్పకపోతే ఎలా? ఆ చిన్న పిల్లే ఈ నాటి యువతి, నిదానంగా, స్వచ్ఛంగా ప్రపంచాన్ని చూడగలిగే జవ్వని. ఇంత స్వతంత్ర మయిన ఊహలు కల వ్యక్తి అని తను అనుకోలేదు. ఆమెని చూస్తూ ఉంటే ఒక మెత్తని, వాత్సల్య పూరిత మయిన జాలి ఆవరించింది అతన్ని. ఈ గడుసు తనం కింద, తేలికగా కదిలిపోయే హృదయం కలది అని తనకి తెలుసు. దృఢ మయిన మనస్సు సులభంగా, నవ్వుతూ వంగిపోగలదు. గంభీరంగా ప్రేమించగలదు. ఆమెలో దాగి ఉన్న క్షమా పూరిత మయిన సౌకుమార్యానికి, శుచికి ఎవరయినా ఆశ్చర్యపడవచ్చు.

ఈ ఆలోచనలతో, ఇంకా ఇతర ఆలోచనలతో సువెనో మనస్సు బరువెక్కి పోయింది. మృదువుగా వాటిని గురించి సుసానాకి చెప్పాలనుకున్నాడు. ఆమె ముఖంలోని వెలుగు, ఆమె తల ఎత్తి పట్టుకున్న ఠీవి, ఆమె స్వచ్ఛ మయిన, శుభ్రమయిన ఆత్మాభిమానం వీటికి చెప్పినట్లే అనుకున్నాడు.

కాని, తన మగవాడి పక్కన, యువన సంపూ

